ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 13 సెప్టెంబర్ 2025

## రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

రాజుపాలెం, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:
మండల పరిధిలోని తొండలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం కడపలో జరిగిన ఉన్నత పాఠశాలల విద్యార్థుల టేబుల్ టెన్నిస్ క్రీడా విభాగం పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి ఐదు మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. అండర్ 14 బాలుర విభాగంలో సుశాంత్, సుభాష్, బాలికల విభాగంలో ప్రశాంతి, అండర్ 17 బాలికల విభాగంలో పోలమ్మ, బాలుర విభాగంలో జితేంద్రలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. టేబుల్ టెన్నిస్ విభాగంలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారిని ప్రోత్సహించి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జిలాని భాష ను ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షరీఫ్, అధ్యాపక బృందం, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా మంచి ప్రతిభ కనబరిచి సత్తా చాటాలని వారు ఆకాంక్షించారు.



## బ్యాంకులోనే మేనేజర్ ఆత్మహత్య

రాజంపేట, సెప్టెంబర్12 ప్రభాతవార్త



పనిచేస్తున్న బ్యాంకులోనే ఆత్మహత్య చేసుకున్న ఓ బ్యాంకు మేనేజర్ విషాద ఉదంతం ఇది.రాయచోటి కరూర్ వైశ్యా బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్ గా పనిచేస్తున్న పవన్ కుమార్ నాయుడు శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బాత్రూంలో ఉరి వేసుకుని బ్రాంచ్ మేనేజర్ పవన్ కుమార్ నాయుడు(38) ఆత్మహత్య చేసుకున్నాడు. బాత్రూం తలుపులు లాక్ చేసి ఉండడంతో సిబ్బంది అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. బ్యాంకులోని మరుగు దొడ్డిలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పవన్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారాన్ని బ్యాంక్ సిబ్బంది, పోలీసులు పవన్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. 5 నెలల క్రితం బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన పవన్ కుమార్ నాయుడు సుండుపల్లి మండలం చప్పిడివారిపల్లికు చెందినవారు. మృతునికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పని ఒత్తిడి వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకుని చనిపోయారని మృతుని భార్య అనూష ఆరోపించారు.ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పంపించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### భూ సమస్యల ఫిర్యాదులకు
# త్వరితగతిన పరిష్కారం చూపాలి

**జిల్లా ఇంఛార్జి కలెక్టర్, జేసీ అదితి సింగ్..**

కడప కలెక్టరేట్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :
భూ సంబంధిత అర్జీదారులు, ఫిర్యాదుదారుల అర్జీల పట్ల భాధ్యతాయుతంగా, త్వరితగతిన స్పందించగలిగినపుడే 100 రెవెన్యూ సమస్యలను పరిష్కరించగలమని జిల్లా ఇంఛార్జి కలెక్టర్, జేసీ అదితి సింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సభాభవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజీఆర్ఎస్) లో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీపై జిల్లా ఇంచార్జి కలెక్టర్, జేసీ అదితి సింగ్ డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్ర మోహన్, చిన్నయ్య, సర్వే ల్యాండ్స్ ఏడీ మురళీ కృష్ణ లతో కలిసి.. సీఎంవో కార్యాలయం నుండి అందిన కాల్స్ మేరకు ఆయా డివిజన్ల ఆర్డీవోలు, అన్ని మండలాల తహాశీల్దార్లు, ఆర్ఐ లు, ఎంపిడివోలు, సంబందిత శాఖల జిల్లా అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ సేవలు, రెవెన్యూ అంశాలు, పివోటీ యాక్ట్ ప్రకారం అసైన్డ్ భూముల పరిష్కారంలో ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని, వచ్చిన ఫిర్యాదులకు సరైన పరిష్కార నివేదికలు కూడా అందడం లేదన్నారు. అలాగే.. సెక్షన్ 22ఏ డెలిషన్ సంబందిత మండల తహాశీల్దార్లు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల పట్ల విచారణ జరగాలన్నారు. ప్రభుత్వం ద్వారా మనం చేసే ప్రతి పనీ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు మంచి పేరు వచ్చేలా చేపట్టాలన్నారు. అనంతరం ఆయా శాఖల వారీగా ఫిర్యాదుల పెండింగ్ పై సమీక్షించారు. రెవెన్యూ శాఖలో ఫిర్యాదుల పెండెన్సీ నమోదుకు వచ్చే నెల లోపు "0" స్థాయిలోకి వచ్చేలా పునఃపరిశీలించి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. మండల స్థాయి అధికారులతో ప్రతివారం, జిల్లా స్థాయిలో 15 రోజులకు ఒకసారి పెండెన్సీని పూరించేందుకు సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. డిఆర్వో విశ్వేశ్వర మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విధి నిర్వహణలో వర్చువల్ గవర్నెన్స్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



క్షేత్ర స్థాయి విజిట్ కు వెళ్లేముందు ముందస్తు ప్రణాళికతో వెళ్లాలని, అవసరమనుకున్న చోట ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించాలని తద్వారా మంచి ఫలితాలను అందుకోగలం అన్నారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల్లో రెవెన్యూ భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన వివిధ చట్టాలు, చేపట్టవలసిన చర్యలు గురించి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా పలువురు రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో నాలుగు రెవెన్యూ డివిజన్లకు చెందిన తహాశీల్దార్లు, ఆర్ఐలు, సంబందిత శాఖల జిల్లాస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఉల్లి పంట కొనుగోలుకు జిల్లా యంత్రాంగం
# ప్రణాళికా బద్దంగా చర్యలు

**జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్..**



కడప కలెక్టరేట్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :
జిల్లాలో పండించిన ఉల్లి పంటను రైతులకు నష్టం వాటిల్లకుండా ఎపి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడుతోందని.. జిల్లా ఇంచార్జి కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ఇంచార్జి కలెక్టర్, జేసీ అదితి సింగ్ అధ్యక్షతన.. ఎపి మార్క్ ఫెడ్ ద్వారా రైతుల నుండి నేరుగా ప్రభుత్వం చేపడుతున్న ఉల్లి పంట కొనుగోలుకు సంబంధించి జిల్లాలోని ఉల్లి రైతులు, ట్రేడర్లతో సమావేశం ఏర్పాటు చేసి,వారి నుండి అభిప్రాయాలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో రైతులు పండించిన ఉల్లి పంటను మార్కెటింగ్ చేయడంలో ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించేందుకు ఎలాంటి చర్యలను అవలంభిస్తే అనుకూలంగా ఉంటుంది ? అనే అంశంపై.. చర్చించడం జరిగింది. ఈ సందర్బంగా ఇంచార్జి కలెక్టరు మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రారంభమైన.. మైదుకూరు, కమలాపురం ఉల్లి కొనుగోలు కేంద్రాలను ఆయా ప్రాంత ఉల్లి రైతులు సద్వినియోగం చేసుకునేందుకు అన్నిరకాల సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు.జిల్లా లోని చాలా ప్రాంతాల్లో ఇంకా ఉల్లి పంట కోతకు సిద్ధంగా ఉందని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యం లో పంట దిగుబడిని ఎలా సంరక్షించుకోవాలి ? ఒక్కసారిగా అధిక పంట యార్డులకు చేరితే దాన్ని ఎలా మార్కెటింగ్ చేయాలి ? అనే అంశాలను రైతులు, ట్రేడర్లతో చర్చించి.. ఉల్లి రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, నాణ్యతను పరిగణన లోకి తీసుకుని ఈ కొనుగోలు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, జిల్లా మార్క్ ఫెడ్ అధికారి పరిమళ జ్యోతి, మార్కెటింగ్ ఎడి ఆజాద్ వలి తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు వారికి అండగా కూటమి ప్రభుత్వం

**నేపాల్ లో తెలుగు వారిని రక్షించడం ఆదర్శం**
**రాజంపేట నియోజకవర్గంలో వారంలో రెండు రోజులు ఇక ప్రజా దర్బార్**
**రాజంపేట టిడిపి ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, సెప్టెంబర్12 ప్రభాతవార్త
తెలుగువారు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, వారికి ఏ ఆపద వచ్చినా 24 గంటల్లో రక్షించి ఇతర రాష్ట్రాల వారికి కూటమి ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు.తెలుగు వారికి అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందన్నారు.ఆపద అంటే అందుకునే బాధ్యత ఉన్న పాలన రాష్ట్రం లో ఉందన్నారు.పాలనతో పాటు ప్రజలకు భరోసా ఇవ్వటమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేపాల్ అల్లర్లలో ఇరుకున్న తెలుగు వారి కోసం కూటమి ప్రభుత్వ రక్షణ చర్యలు ప్రతి రాష్ట్రానికి ఆదర్శం అన్నారు. నేపాల్ బాధితులను ఆదుకోవాలని కనీసం జగన్ రెడ్డి డిమాండ్ అయినా చేశారా అని ప్రశ్నించారు. ఎంత సేపు ప్రతిపక్ష హోదా కోసం పోరాడడం తప్ప ప్రజల బాధలు పట్టవా అని ఎద్దేవా చేశారు. నేపాల్‌లో ఉన్న తెలుగు ప్రజల కోసం ప్రత్యేక విమానాలు పంపి తెలుగువారు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఆదుకోవడం బాధ్యతగా, కర్తవ్యంగా భావించి నిరూపించిన కూటమి ప్రభుత్వం తెలుగోడు కి అండగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాం.తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీ పార్టీ పుట్టిందనీ,వారి భద్రతా భరోసా కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందనీ స్పష్టం చేశారు.రాజంపేట నియోజకవర్గంలో వారంలో రెండు రోజులు ప్రజా దర్బార్ నిర్వహించినట్లు వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళతామన్నారు.

## నేడే జాతీయ లోక్ అదాలత్

**ఉమ్మడి కడప జిల్లాలో 23 బెంచీలు ఏర్పాటు**

రాజంపేట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 23 బెంచీలు ఏర్పాటు చేశామని, నేడు జరిగేజాతీయ లోక్ అదాలత్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కడప లో 4, ప్రొద్దుటూరు 3, రాజంపేట 3, రాయచోటి 3, బద్వేల్ 2, సిద్ధవటం, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, నందలూరు మరియు రైల్వే కోడూరులో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మరింత సమాచారం కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్: 08562 258622, 244622 నంబర్లలో సంప్రదించాలన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చునన్నారు. న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు "జాతీయ లోక్ అదాలత్ ను" జయప్రదం చేయవలసిందిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్

పోరుమామిళ్ల రూరల్ సెప్టెంబర్ 12ప్రభాతవార్త:
పోరుమామిళ్ల పట్టణంలోని పూల బజార్ లో గత కొద్దిరోజులుగా మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం అని ఆవీధి వాసులు పోరుమామిళ్ల మేజర్ సర్పంచ్ యనమల సుధాకర్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి మండల గ్రాంట్స్ లో దాదాపు నాలుగు లక్షల రూపాయలు నిధులతో కొత్త బోరు మోటర్ వేయించి మంచినీటి సమస్యను పరిష్కరించారు.



## నేత్రదానంతో అంధ రహిత సమాజం నిర్మిద్దాం..

**జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ మాధవి లత**



స్నేహిత అమృత హస్తం రాజు కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

పులివెందుల సెప్టెంబరు 12 ప్రభాతవార్త:
నేత్రదానంతో అంధ రహిత సమాజం నిర్మిద్దాం అని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ మాధవి లత పేర్కొన్నారు. 40 వ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో కడప జిల్లా కేంద్రం లోని జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ మాధవి లత, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ఆర్గాన్ డొనేషన్ అన్నమయ్య జిల్లా చైర్మన్ కొత్త సుదర్శన్ ల చేతులమీదుగా కడప, అన్నమయ్య జిల్లాల లో నేత్రదానం చేసిన నేత్రదాత కుటుంబ సభ్యులకు నేత్ర దాత అమర్ రహే జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్బంగా డాక్టర్ మాధవి లత మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేసి అంధత్వం తో బాధ పడుతున్న అంధుల కు చూపు ఇచ్చి ఈ ప్రపంచాన్ని చూసే బృహత్కార్యం నేత్రదానం అని, ఈ పుణ్యకార్యాన్ని మనందరం నేత్రదానం చేసేందుకు అవగాహన కలిగి, కల్పించి అంధ రహిత సమాజ నిర్మిద్దాం అని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో నేత్రదానం చేసిన నేత్రదాత కుటుంబ సభ్యులు,హర్ష కుమార్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి కోశాధికారి అనీల్, సభ్యులు జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల విక్రయాల్లో
# అక్రమాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తాం : జేడిఏ





దువ్వూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:
రసాయనిక ఎరువుల విక్రయాలలో ఏ దుకాణదారుడైన అక్రమాలకు పాల్పడి అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తూ క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన దువ్వూరులో మహానందీశ్వర ఎరువుల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. గురువారం రాత్రి యూరియా బస్తాలను అక్రమంగా తరలిస్తున్నారని పత్రికలలో వార్తలు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ట్రేడర్స్ కు సంబంధించిన ఎరువుల నిల్వలను, గోదాములో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం కామనూరు రోడ్డులో నిల్వ ఉన్న గోదాములో యూరియా నిల్వ ఉన్నదని తెలిసి అక్కడికి జేడితో పాటు అధికారులు వెళ్ళగా గంట సేపటికి కూడా దుకాణపు యజమాని రాకపోవడం విశేషం. అనంతరం ఆయన ఆ గోదామును పరిశీలించిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ గురువారం ట్రేడర్స్‌కు 9 టన్నులు, 200 బస్తాలు యూరియా కేటాయించామన్నారు. అందులో 173 బస్తాలు నిల్వ ఉందని 27 బస్తాలు రైతులను మోసగించి అధిక ధరలకు అమ్మి అక్రమ లాభం పొందినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అందువల్ల దుకాణపు యజమానిపై కేసు నమోదు చేయవలసిందిగా పోలీసులకు తెలియజేశామన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని కేవలం కేసీ కెనాల్ ప్రాంతంలో యూరియా ఉందని అయితే అక్కడికి కూడా కేటాయించామని అన్నారు. ఇంకా రైతులు యూరియా డిమాండ్ చేస్తున్నారని అందువల్లనే అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. ఈ విచారణలో వ్యవసాయ అధికారులు కేవలం కంటి తుడుపు చర్యలుగా మాత్రమే విచారణ చేశారని రైతులకు న్యాయం జరిగే విధంగా విచారణ చేయలేదన్నారు. దుకాణపు యజమాని అక్రమాలకు పాల్పడినట్లు స్పష్టంగా ఉన్నా కేవలం 27 బస్తాలు మాత్రమే అక్రమంగా అమ్మాడని చెప్పడం విరుద్ధంగా ఉందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా దుకాణంలో మిగిలి ఉన్న 173 యూరియా బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటిని సీజ్ చేసినట్లు తెలిపారు. సదరు విషయంపై జాయింట్ కలెక్టర్ వారి కోర్టులో కేసు నమోదు చేసేందుకు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా దువ్వూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సదరు ఫిర్యాదు మేరకు దువ్వూరు ఎస్సై వినోద్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఏదిఏమైనా అర్ధరాత్రి యూరియా తరలింపు పై జిల్లా వ్యవసాయ అధికారులు సక్రమంగా వ్యవహరించకపోవడం విశేషం అన్నారు. రాత్రిపూట ఆటోలో తరలిపోతున్న విషయాన్ని ఫోటోలు, వీడియోల ద్వారా స్పష్టంగా తెలిసిన దుకాణపు యజమానిపై కేవలం చిన్న కేసు నమోదు చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి రైతులకు సక్రమంగా యూరియా అందించాలని కోరుతున్నారు. శుక్రవారం మండలంలో యూరియా పంపిణీ చేయగా మన గ్రోమోర్ సెంటర్ వద్ద రైతులు యూరియా కోసం ఎక్కువ సంఖ్యలో వచ్చారు. దీంతో యూరియా డిమాండ్ పరిస్థితి ఎలాగా ఉందో అర్థం అవుతుంది.

## రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

దువ్వూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:
మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పంచాయతీకి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డిఎల్ డిఓ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పరిశుభ్రత, ఇంటి, కొళాయి పన్నుల వసూళ్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం దువ్వూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి విధులకు సక్రమంగా హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరారెడ్డి, ఈ ఓ పి ఆర్ డి హరికృష్ణ పాల్గొన్నారు.



## రోడ్డు దాటుతున్న వ్యక్తులను ట్రావెల్స్ ఢీకొనడంతో ఇరువురు మృతి

### మరొకరికి తీవ్ర గాయాలు..



**ఓబులవారిపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

కడప చెన్నై ప్రధాన రహదారి మంగంపేట చెన్నకేశ్వర స్వామి ఆలయం సమీపాన మంగళంపల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళంపల్లి గ్రామానికి చెందిన అంకమ్మ రామచంద్రయ్య మరియు రామలక్ష్మములు రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి రైల్వే కోడూరు కి వెళుతున్న ఆర్కే ట్రావెల్స్ ఢీకొనడంతో మంగళంపల్లి గ్రామానికి చెందిన అంకమ్మ 70 సంవత్సరాలు రామచంద్రయ్య 55 సంవత్సరాలు మృతి చెందగా రామలక్ష్మమ్మ దేవరగాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా కొటాచుగా ప్రథమశిక్షిత కోసం ఎస్ఐ మహేష్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసే విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు అంతేకాకుండా రోడ్డు దాటుతున్న వృద్ధులను బస్సు ఢీకొనడంతో చూసిన ప్రతి ఒక్కరు కంటతడి పెట్టుకుని డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని పనులు చూసిండు సలహాలు ఇస్తున్నారు ఏది ఏమైనా మంగళంపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి ఈ రోడ్డు ప్రమాదం జరగడం ఎంతో దురదృష్టకరమని పలువురు దిగురాంతి చెందుతున్నారు.

## సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్..

**కడప కార్పొరేషన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

సూపర్ సిక్స్ సూపర్ హిట్ కాదని అట్టర్ ఫ్లాప్ అని మాజీ డిప్యూటీ సీఎం ఎస్ బి. అంజద్ భాష టిడిపి ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం కడప తన కార్యాలయంలో విలేకరులతో అంజద్ భాష మాట్లాడుతూ అనంతపురంలో కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ సభకు ప్రభుత్వ ఆర్టీసీ బస్సులు ఉపయోగించి బలవంతంగా భయపెట్టి డ్వాక్రా మహిళలను తరలించారని మండిపడ్డారు. 16 నెల టిడిపి పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీరం చేశారని, అవినీతి జరిగిందని, సహజ సంపద ఇసుక, మట్టిని దోచుకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించలేదని, 87 లక్షల విద్యార్థులు గాను 54 లక్షల మందికి తల్లికి వందనం ఇచ్చారని, 26 సర్వీసులు ఉంటే కేవలం ఐదు సర్వీసులు మాత్రమే మహిళలకు ఉచిత బస్సు ఇచ్చారని, 55 లక్షల మంది రైతులకు గాను 47 లక్షల మంది రైతులకు రైతన్నలకు రూ. 5 వేలు వచ్చారని దివ్యబుట్టారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసా కేంద్రాలను మూత పడేట్టు చేశారని రైతులకు యూరియా అందించడం లేదని తెలిపారు. మహిళల పట్ల దాడులు అత్యాచారలు జరుగుతున్న పట్టించుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బిహెచ్. ఇలియాజ్, జయచంద్ర రెడ్డి, బసవరాజు త్యాగరాజు, రవి, చిట్టిబాబు, జమీల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.




## బీజేపీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో పాలాభిషేకం




**పెండ్లిమర్రి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరియు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జీఎస్టీ తగ్గింపు రూపంలో దీపావళి బహుమతి ముందుగానే అందించారని మండల అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి కొనియాడారు. ఈ పన్నుల తగ్గింపుతో భారతీయ జనతా పార్టీ ప్రజలకు మరింత చేరువైందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌నాయుడు, బాల గురవయ్య యాదవ్, పుల్లారెడ్డి, గంగిరెడ్డి, లక్ష్మిరెడ్డి, రాంమోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవిన్యూ ఇన్స్పెక్టర్ గా మురుగయ్య



**పీలేరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :**

పీలేరు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా ఎస్ మురుగయ్య శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇతను ఇదివరలో మదనపల్లి రెవిన్యూ కార్యాలయంలో జూనియర్ సహాయకునిగా పనిచేశారు. తరువాత బదిలీపై వాయల్పాడు జూనియర్ సహాయకుడిగా పనిచేస్తూ పదోన్నతి పై పీలేరు ఆర్ ఐగా వచ్చారు. ఆరు నెలలకు మునుపు ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన చాణి క్య బదిలీపై వెళ్లారు. ఆరు నెలలపాటు సీనియర్ సహాయకులు వెంకటేశ్వర య్య అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మురుగయ్య మాట్లాడు తూ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారికి నా పరిధిలో ఉన్న పనులను ఎలాంటి జాప్యం లేకుండా సహకరిస్తానని ఆయన తెలిపారు.

## భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు

**కలికిరి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

కలికిరి-కలకడ రోడ్డు మార్గంలోని మేడికుర్తి క్రాస్ సమీపంలో ఉన్న శివయోగి మఠం భూములు అన్యాక్రాంతం కాకుండా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర జంగం సంక్షేమం సంఘం మరియు అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వాసనూరి చంద్రశేఖర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. శివయోగి మఠం భూములను పరిశీలించి హద్దులు ఏర్పాటు చేయాలని అన్నమయ్య జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్ విశ్వనాథం కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో దేవాదాయ సహాయ కమిషనర్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌తో కలిసి మఠం భూములు పరిశీలించారు. త్వరలో పూర్తి స్థాయిలో సర్వే చేసి మఠం భూముల పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ఆలయంలో దూపదీప నైవేద్యం కోసం ఆర్థిక సాయం కూడా త్వరలో అందించేలా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జంగం సంక్షేమ సంఘం నాయకులు కొటాల చల్లయ్య, పాల్గొన్నారు.

## కేఎస్ఆర్ఎం కాలేజీలో మహిళల ఆరోగ్య అవగాహన కార్యక్రమం



**కడప కలెక్టరేట్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :**

స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో "హ్యాపీ యూటరస్ అండ్ హెల్తీ పీరియడ్స్" అంశంపై మహిళల ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ఎస్ జె సెమినార్ హాల్ లో విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థినులు మరియు మహిళా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పీఈఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పీడియాట్రిక్స్ విభాగంలో పనిచేస్తున్న కె. జయశ్రీ మరియు ఫెమీ9 గ్రూప్‌కు చెందిన మెన్‌స్ట్రువల్ హైజీన్ ఎడ్యుకేటర్ అనంత్ వనరుల వ్యక్తులుగా పాల్గొని విద్యార్థినులకు విలువైన సమాచారం అందించారు. యాంటీసెక్సువల్ హరాస్‌మెంట్ సెల్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, హెల్త్ క్లబ్ స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జి. రాధ, ఎస్. శర్మిళ బాను, కె. నివేదిత, బి. మనోరమ దేవి సమావేశకులుగా పాల్గొన్నారు. మహిళల రుతుకాల ఆరోగ్య పరిశుభ్రత గురించి వివరణాత్మక అవగాహన కల్పించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని మంచి స్పందన చూపించారు. ఈ కార్యక్రమంలో కలశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ ఎన్ ప్రసాద్, పాల్గొన్నారు.

## మండలంలో యూరియా కొరతలేదు

### అగ్రికల్చర్ రమేష్ రెడ్డి



**సిద్ధవటం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

మండలంలో వరి పంట రైతులకు యూరియా మంజూరు కావడంతో రైతులు ఆనందమయ్యారు సిద్ధవటం మండలానికి 19.8 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు కావడంతో రైతులు ఆనంద మై పోయారు అందులో భాగంగా శుక్రవారం సిద్ధవటం మండలంలోని సిద్ధవటం రైతు సేవా కేంద్రానికి 9.9 మెట్రిక్ టన్నులు మరియు,టక్కోలి రైతు సేవ కేంద్రంలో 9.9 మెట్రిక్ టన్నుల యూరియా ను దేగనవారిపల్లి, కాజిపల్లి, కడ పాయపల్లె తదితర గ్రామాలకు చెందిన రైతులు యూరియాను ఆనందంగా తీసుకెళ్లారు మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి మాట్లాడుతూ వరి పంట పొలాల రైతులకు యూరియా కొరత లేదని ఉన్నత అధికారుల ఆదేశాలతో యూరియా మంజూరు కావడంతో రైతులకు సంబంధించి భూమి పట్టా పుస్తకము, ఆధార్ కార్డు పరిశీలించి అర్హులైన ప్రతి రైతుకు యూరియా అందిస్తున్నామని మండలంలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని ప్రతి రైతుకు యూరియా అందిస్తున్నామని అన్నారు కూటమినేత నిమ్మకాయల జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పక్క రాష్ట్రం తెలంగాణలో యూరియా అందలేదని రైతులు ఆందోళన చేస్తున్నారు ఏపీ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రైతులకు యూరియాపంటలకు సరిపడా దిగుమతి చేస్తున్నారని సిద్ధవటం మండలంలో అధికారులు అర్హులైన ప్రతి రైతులకు యూరియా అందిస్తున్నారని తెలిపారు స్థానిక మండల ఎస్సై మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి రైతులకు యూరియా మంజూరు చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నేత పాలకొండయ్య రైతులు కూటమి నేతలు పాల్గొన్నారు.

## హత్యా యత్నమా .... ప్రమాదమా ..!

**పులివెందుల,సెప్టెంబరు 12, ప్రభాత వార్త:**

పులివెందుల పట్టణ శివారులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గల చెక్క డిపో సమీపంలో శుక్రవారం ఎర్రగుడి పాలెంకు చెందిన ఆనందరావు అనే వ్యక్తి తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన పడి ఉండటం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకి చేరుకొని గాయపడిన ఆనందరావు నీ 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నల్లచెరువు పల్లికి చెందిన ఆనందరావు పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో కేర్ టేకర్ గా పనిచేస్తు జీవనం గడుపుతున్నాడు.పది సంవత్సరాల క్రితం పులివెందుల పట్టణంలోని ఎర్రగుడి పాలెంలో నివాసం ఉంటున్నారు.ఆనందరావు సోదరుడు యురేనియం కర్మాగారంలో పని చేస్తూ మృతి చెందాడు అని దానితో అతని వదిన పిల్లలను కూడా వదిలిపెట్టి వెళ్ళినట్టు ఈ విషయంపై ఆనందరావుకి అతని వదినకు గొడవలు జరుగుతున్నాయని ఎర్రగుడి పాలెం ప్రజలు అనుకుంటున్నారు. సంఘటన స్థలంలోనీ పరిస్థితులు గమనిస్తే హత్య యత్నం లా కనిపిస్తోంది అని సమాచారం. దీనితో ఆనంద రావు గాయాలు పాలు అయిన సంఘటన హత్య యత్నమా లేక ప్రమాదమా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ప్రమాదవశాత్తు ఘటన జరిగిందా లేదా మరి ఏదైనా కారణం ఉందా అన్నకోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

**అన్ని కోణాలలో విచారణ చేస్తున్నాం : అర్బన్ సీఐ సీతా రామి రెడ్డి**

ఆనందరావు గాయపడిన సంఘటన పలు అనుమా నాలకు వ్యక్తం అవుతున్నాయి అని కావున అన్ని కోణాలలో విచారణ చేయాల్సి ఉందని ఆనందరావు అన్ కాన్షియస్ లో ఉన్నాడు అని సమగ్ర విచారణ చేస్తున్నాం అని విచారణ అనంతరం పూర్తి వివరాలు అందిస్తున్నాము అని అర్బన్ సీఐ సీతా రామి రెడ్డి అన్నారు.



## బసవరాజును సన్మానించిన అంజాద్ భాష



**కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

వైయస్సార్ సిపి సత్యసాయి జిల్లా బీసీ సెల్ జిల్లా కమిటీ ఇంచార్జ్ సమ్మెట బసవరాజును నియమించిన సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం ఎస్ బి. అంజద్ భాష ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమ్మెట బసవరాజు మాట్లాడుతూ పార్టీకోసం మరింత కష్టపడుతానని చెప్పారు. కూటమి ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాలను ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జయచంద్ర రెడ్డి, బిహెచ్.ఇలియాస్, త్యాగరాజు, బాబు, రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు టిపి.వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

## రైతులకు యూరియా పంపిణీ



**రామసముద్రం సెప్టెంబర్ 12ప్రభాతవార్త**

రామసముద్రం మండలంలో ని చొక్కాండ్ల పల్లె 222,కేసీ పల్లె 222,రామసముద్రం 290బ్యాగులు వ్యవసాయ అధికారి జాఫర్ శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతి రైతుకు యూరియా అందజేయడం జరుగుతుందన్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ పంటలకు సమృద్ధిగా నత్రజని అందుతుందని, రైతులు నానో యూరియా వాడకం పెంచాలని సూచించారు. యూరియా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నా తాహిసీల్దార్ మహ్మద్ అజారుదీన్,ఎస్సై డి. రమేష్ బాబు పోలీస్ సిబ్బంది వ్యవసాయాధికారి జాఫర్, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## చినుకుల్లోనూ మెరుపులీనుతూ..

సీజన్ ఏదైనా.. ముఖం అందంగా మెరవాలనుకుంటాం. అయితే ఈ వర్షాకాలంలో తడిసినప్పుడు మేకప్ కరుగుతుంది. ముఖమంతా ప్యాచ్‌లుగా కనిపించడంతో ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాకాకుండా ఉండాలంటే మేకప్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలంటున్నారు నిపుణులు.

చర్మాన్ని ఈ సీజన్‌లో పొడారనివ్వకుండా జాగ్రత్తపడాలి. వాతావరణం చల్లగా ఉందంటూ నీటిని తీసుకోకుండా ఉండకూడదు. శరీరానికి కావాల్సినంత నీటిని అందించాలి. అప్పుడే చర్మం ఆరోగ్యంగా తేమగా ఉంటుంది. ఇక మాయిశ్చరైజర్ విషయానికొస్తే మిగతా కాలాల్లో వాడే దానికి ప్రాధాన్యం ఇవ్వకూడదు. ఇది ముఖాన్ని జిడ్డుగా మారుస్తుంది. ఆ తరవాత ముఖంపై వేసే మేకప్‌నూ ప్రభావితం చేస్తుంది. బదులుగా నాణ్యమైన, నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌ను ఎంచుకుంటే సరి. ఇది మేకప్‌కు మంచి బేస్ అవుతుంది. చినుకులు పడినప్పుడు కూడా ముఖంపై ప్యాచెస్‌లా కనిపించనివ్వదు. మస్కారా కూడా వాటర్‌ప్రూఫ్ అయితేనే మేలు. కళ్లకు పెట్టిన వెంటనే త్వరగా ఆరుతుంది. తడికి కరగకుండానూ ఉంటుంది. మేకప్ తీసేయాలనుకున్నప్పుడు గులాబీనీళ్లలోనో కొబ్బరినూనెలోనో ముంచిన దూదితో తేలికగా శుభ్రం చేయొచ్చు.

**పౌడర్ ఆధారితంగా...** ముఖ చర్మం మృదువుగా మెరిసేలా కనిపించడానికి ముందుగా వేసే ప్రైమర్ విషయంలో మ్యాట్ ఫినిష్ ఇచ్చేదాన్ని ఎంచుకోవాలి. మేకప్ చెరిగిపోకుండా ఇది నిలపగలుగుతుంది. అలాగే మేకప్‌లో క్రీమ్స్ వినియోగంకన్నా పౌడర్ వాడితే మంచిది. ఈ సీజన్‌లో లైట్ వెయిట్ లిక్విడ్ ఫౌండేషన్‌లో ముందుగా కొంచెం వదులుగా ఉండే పౌడర్ కలుపుకోవాలి. మందపాటి ఫౌండేషన్ బ్రష్‌తో తేలికపాటిలేయర్స్‌గా అప్లై చేయాలి. ఈ విధానంలో ముఖం తడిసినా ప్యాచెస్‌లా కనిపించదు.

**తక్కువగా....** లిప్‌స్టిక్ గ్లాసీగా కనిపించేది కాకుండా మ్యాట్ లుక్ ఇచ్చేది తీసుకోవాలి. అనుకోకుండా చినుకుల్లో తడిసినప్పుడు ఇది చెరగకుండా,



పెదవులకు న్యూట్రల్ టింట్ ఇస్తుంది. ఎక్కువ సమయ తాజాగా కనిపించేలానూ చేస్తుంది. అంతేకాదు, వర్షాకాలలో ఎంత తక్కువ మేకప్ వేస్తే అంత మంచిది. చెక్కిళ్లు, గడ్డం, ముక్కు చివర, కనుబొమల మధ్య మానరతం వాటర్‌ప్రూఫ్ కన్సీలర్‌ను బ్రష్‌తో కాస్తంత హైలైట్ చేయగలిగితే చాలు. చివరగా మేకప్ సెట్టింగ్ స్ప్రే తప్పనిసరి. ఇది మేకప్ కరగకుండా కాపాడుతుంది. చినుకుల్లోనూ మెరిసే మోము సొంతమవుతుంది.

## వారి గెలుపు వెనక పూర్ణిమ

**2014 ఏషియన్ క్రీడలు.. శ్వేతా చౌదరి షూటింగ్‌లో కాంస్యం గెలిచింది. అలా విజేతలను ప్రకటించగానే.. ఆమె భర్త నుంచి పూర్ణిమకి ఫోన్! కాల్ కనెక్ట్ అవ్వగానే భావోద్వేగంతో 'థాంక్యు' అనే చెప్పాక అతనికీ నోట మాట పెగల్లేదు. ఇంకోసారి హీనా సిద్ధూ బంగారు పతకం గెలిచినప్పుడూ అంతే! అయితే ఈ సారి హీనానే నేరుగా ఆ మెడల్‌ని తెచ్చి పూర్ణిమ మెడలో వేసింది. అసలు ఎవరీ పూర్ణిమ రమణ్ గోమ్‌దిర్? వీళ్ల గెలుపులో ఆమె పాత్ర ఏమిటంటే..**

ఇంట్లో ఎవరికీ క్రీడా నేపథ్యం లేదు. కానీ క్రికెట్ వస్తోందంటే పూర్ణిమ కుటుంబమంతా టివి ముందుకు చేరిపోతారు. ఇక బామ్మ సంగతైతే అసలు చెప్పనక్కర్లేదు. 80 ఏళ్ల వయసున్నా టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లనీ ఆసక్తిగా చూసేది. వాటిని ఆవిడ విశ్లేషిస్తోంటే పూర్ణిమ ఆసక్తిగా వినేవారు. అసలు బామ్మ నుంచే క్రికెట్‌పై ప్రేమ మొదలైందామెకు. ఈమె స్వస్థలం ఢిల్లీ. అహ్మదాబాద్, ఢిల్లీల్లో పెరిగారు. స్కూల్ క్రికెట్ టీమ్‌లో ఆడినా తరవాత కొనసాగించలేక పోయారు. కానీ ఆటలకు సంబంధించిన కెరియర్‌నే ఎంచుకోవాలన్నది పూర్ణిమ కల. కానీ ఇంట్లోవాళ్లకేమో తను వైద్యవిద్య చదివితే చూడాలని ఆశ. ఏం తోచక చూస్తోన్న పూర్ణిమకు ఆమె అంకుల్ ఫిజియోథెరపీ చదవమని సలహానిచ్చారు. అప్పుడైతే ఆటగాళ్లతో కలిసి పనిచేయొచ్చు. అమ్మానాన్నల కలా నెరవేతుందని బెంగళూరులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నుంచి బ్యాచిలర్స్, మంగళూరులోని డా.ఎంవీ శెట్టి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ నుంచి పిజి పూర్తి చేశారు.

**ఆట నేర్చుకుని మరీ..** అమ్మాయి.. పైగా బక్కపలచన. ఈమె ఎలా ఈ రంగంలో నెగ్గుకొస్తుంది. సహాధ్యాయులు ఎన్నోసార్లు తన ముందే ఈ సందేహాన్ని వెలిబుచ్చేవారు. కానీ పూర్ణిమ అవేమీ పట్టించుకోకుండా కష్టపడి చదివారు. చదువు పూర్తవడంతోనే తొలి అవకాశం తలుపు తట్టింది. 2010 కామన్‌వెల్త్ క్రీడల్లో పోటీపడుతోన్న సీఆర్‌పిఎఫ్ షూటింగ్ టీమ్‌కి 'స్పోర్ట్స్ ఫిజియో'గా పనిచేసే అవకాశం దక్కించుకున్నారు. ఆట సాధనలో భాగంగా, వ్యాయామం చేసేటప్పుడు క్రీడాకారులు గాయాల పాలు అవ్వడం చూస్తుంటాం కదా. అలా కాకుండా జాగ్రత్తలు సూచించడం, పొరపాటున ఏదైనా ప్రమాదానికి గురైనా త్వరగా కోలుకునేలా చూడటం వంటివి ఈమె విధులు. ఉత్సాహంగా బాధ్యతలు నిర్వర్తించారు. దీంతో టెన్నిస్, రెజ్లింగ్.. ఇలా భిన్న క్రీడాకారులతో పనిచేసే అవకాశా లొచ్చాయి. అప్పుడే ఓ ఆలోచన తట్టింది పూర్ణిమకు. క్రీడాకారులకు సలహా ఇవ్వడం తేలికే. కానీ అవి వాళ్లకు నిజంగా ఉపయోగపడితేనే కదా ప్రయోజనం అనిపించింది. అది సాధ్యమవ్వాలంటే ఆట గురించి తెలిసుండాలి అనుకున్నా. అందుకే కోచ్‌ల దగ్గరికి వెళ్లి ఆటను నేర్పించమని అడిగా. కొత్తల్లో గాయాలు అవుతాయన్నా పర్లేదని చెప్పి మరీ నేర్చుకున్నా. అది ఆటగాళ్ల గురించి లోతుగా తెలుసుకునే వీలు కల్పించింది అంటారు పూర్ణిమ. ఈ తత్వమే ఆమెకు ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులతో పనిచేసే వీలు కల్పించింది.

**విజేతలుగా చేయాలని....** ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ (ఓజీక్యూ).. పూర్ణిమ పనితీరును గమనించి, తమతో కలిసి పనిచేయమని ఆహ్వానించింది. ఓజీక్యూ.. సత్తా ఉన్న క్రీడాకారురలను ఎంపిక చేసి, ఆరోగ్యకరమైన ఆహారం దగ్గర్నుంచీ కోచింగ్, అవసరమైన పరికరాలు అందించడం వరకూ అన్ని అంశాల్లో సాయం చేస్తుంది. తగిన శిక్షణనిచ్చి మెరికల్లా తీర్చిదిద్దుతుంది. ప్రకాశ్ పదుకోణ్, విశ్వనాథన్ ఆనద్, నీరజ్ బజాజ్, విద్యా షా వంటి ఎందరో ఈ సంస్థలో డైరెక్టర్లుగా ఉన్నారు. ఓజీక్యూతో కలిసి పూర్ణిమ 14 ఏళ్లుగా ఒలింపిక్స్ పారాలింపిక్స్ అభ్యర్థులకు శిక్షణలో సాయమందిస్తు న్నారు. మెడికల్‌సైన్స్ విభాగానికి అధిపతిగా సంబంధిత బృందాన్నీ నడిపిస్తున్నారు. శ్వేత ఏషియన్ క్రీడలకు సిద్ధమయ్యేటప్పటికి వెన్నునొప్పితో బాధపడుతోంది. హీనాకేమో గాయంతో సమస్య. వీళ్లే కాదు.. ఇలాంటి సమస్యలతో సతమతమయ్యే మరెందరో క్రీడాకారులు వాటిని అధిగమించి పతకం సాధించినప్పుడు నేనే గెలిచా అన్నంత ఆనందం అనే పూర్ణిమ ప్రో టెన్నిస్ అకాడమీలోనూ సేవలందిస్తున్నారు. ఇంటర్నేషనల్ రగ్బీ టోర్నమెంట్‌కి డోపింగ్ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ట్రాన్స్‌స్టాడియా యూనివర్సిటీకి ప్రోగ్రామ్ డైరెక్టర్ కూడా.

## బద్వేల్‌లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**బద్వేల్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

బద్వేల్ ను రెవిన్యూ డివిజన్ చేసిన నేపథ్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్ చంద్రశేఖర్ జిల్లా కమిటీ మెంబర్ జకరయ్య డిమాండ్ చేసారు .శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు పట్టణాన్ని రెవిన్యూ డివిజనల్ అయిన నేపథ్యంలో డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల నుండి రెవిన్యూ సమస్యలతో పాటు సబ్ రిజిస్టర్ వంటి పనుల పైన నిత్యం వేలాదిమంది ప్రజలు పట్టణానికి రావడంతో పాటు బద్వేలు పట్టణంలో రోజురోజుకు జనాభా పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రెవిన్యూ డివిజన్ తో పాటు డిఎస్పి ఆఫీసు ఇక్కడ ఏర్పాటు చేసి ఉంటే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూడా వచ్చేదని వారన్నారు. బద్వేలు పట్టణం నాలుగు రోడ్ల నుండి ఇరువైపులా మూడు కిలోమీటర్ల దూరంలో పట్టణం విస్తరించిందని లక్ష పైబడి జనాభా వున్నారని పట్టణంలో రోజు వారి పనుల నిమిత్తమ్ వేల పైబడి 2 విలర్స్. 3విలర్స్ 4విలర్స్ వంటి వాహనాలు విపరీతంగా తిరుగుతున్నాయని అలాగే నాలుగు రోడ్లలో మాత్రమే సిగ్నల్స్ ఉండడం తో మిగతా ఎక్కడ కూడా లేకపోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని వారన్నారు. పట్టణంలో నాలుగు రోడ్లలో పార్కింగ్ ప్లేస్ ను, ఆటో స్టాండ్ లను టు విలర్ల స్టాండ్ లను ఏర్పాటు చేయాలని అలాగే మైదుకూరు రోడ్డు నెల్లూరు రోడ్డు సిద్ధవటం రోడ్లలో సులబ్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు . తక్షణమే రెవెన్యూ,పోలీస్, మున్సిపల్,అధికారులు కలుగజేసుకొని పై సమస్యలు అన్నింటిని పరిష్కరించాలని వారు కోరారు .ఈ సమావేశంలో విద్యార్థి సంగం జిల్లా నాయకులు అనిల్ కార్మిక సంగం నాయకులు నారాయణ , చంద్రపాల్ సిపిఐ ఎం ఎల్ ఏరియా కమిటీ సభ్యులు. రామరాజు, బాబు, విజయరావు, జయరామరాజు, తదితరులు పాల్గొన్నారు




## బస్సు సౌకర్యంపై ప్రయాణికులు హర్షం

### ప్రారంభించిన కూటమి నాయకులు



**వేంపల్లె :సెప్టెంబర్12:(ప్రభాత వార్త)**

ఇడుపులపాయకు బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ లో టిడిపి కూటమి నేతలు బస్సు సర్వీస్ ని ప్రారంభించారు. అనంతరం టిడిపి ఉపాధ్యక్షుడు వీరభద్ర మాట్లాడుతూ తమ నాయకుడు బిటెక్ రవి కృషితో బస్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. తమ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గాలిహరిప్రసాద్, డక్కారమేష్, మహమ్మద్, అహ్మద్(సేర్), సునీల్, అంజీ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మునయ్య కోన లో వ్యక్తి మృతి...

**ముద్దనూరు .సెప్టెంబర్ 12. ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మునయ్యకోన సమీపంలో తొండూరు మండలం గంగాదేవి పల్లె గ్రామానికి చెందిన చిట్టిబోయిన గంగాధర్, 53 సంవత్సరములు అనునతను మృతి చెందినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు తొండూరు పోలీస్ స్టేషన్ లో మృతునిపై బుధవారం కుటుంబ సభ్యులు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిసింది, మృతిని బంధువులు వెతుకుతూ మునయ్య కోన లో చూడగా, పురుగుల మందు తాగి చనిపోయి ఉన్నట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ దస్తగిరి వెళ్లి పరిశీలించి సంఘటనపై విచారిస్తున్నట్లు తెలిపారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

షేక్ అలీ గఫార్ తండ్రి షేక్ అబ్దుల్ గఫార్ D/No: 26-889-2 ప్రొద్దుటూరు టౌన్ మరియు (మం) వైయస్ఆర్ కడప, ఏపీ., మా ఇంటి నుండి బైకుపై గాంధీనగర్‌కు పోతుండగా నా పాస్‌పోర్ట్ పోయినది నెం: R9357394 దొరికిన వారు పై అడ్రస్‌కి తెలియజేయగలరు.

# పంచాయితీ కార్మికులకు జీతాలు చెల్లించాలి

మదనపల్లె, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :

కురవంక గ్రామ పంచాయితీ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దురుసుగా ప్రవర్తించిన పంచాయితీ సెక్రటరీ మంజులపై చర్యలు తీసుకోవాలని బివైఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా బివైఎస్ అధ్యక్షులు పునిత్ మాట్లాడుతూ పంచాయితీ కార్యదర్శి మంజుల కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని, వారిపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గత రెండు నెలలుగా కార్మికులకు వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈసమస్యపై ఎన్నిసార్లు విన్నవించినా ఆమె పట్టించుకోలేదన్నారు. గతంలో ఉన్న సెక్రటరీ చేతనే జీతాలు పెట్టించుకోండి, లేకపోతే పని మానేయండంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. సెక్రటరీ మంజుల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తూ ప్రజలను, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తొందన్నారు. గతంలో ఈమె వ్యవహారశైలిపై ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయితీ కార్మికులకు వేతనాలు చెల్లించి స్థానికులైన సెక్రటరీ మంజులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కురవంక పంచాయితీ వార్డు సభ్యులు క్రిష్ణమూర్తి, నాగరాజు, కార్మికులు హనుమంతు, కేశవ, సురేష్, శంకర, రెడ్డమ్మ, అలివేలు, బివైఎస్ నాయకులు హరి, శశికుమార్, వినయ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలు వ్యక్తం చేస్తున్న దృశ్యం

## 17, 18 నమండల స్థాయి క్రీడా పోటీలు

రాజంపేట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

నందలూర్రుమండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలకు ఈ నెల 17, 18 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలలో 14 సంవత్సరాల లోపు బాలబాలికలు రెండు విభాగాలుగాను, 17 సంవత్సరాల లోపు బాలబాలికలు మరో రెండు విభాగాలుగాను ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య, మండల విద్యాశాఖ అధికారి అనంతకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, ఎస్.జి.ఎఫ్. మండల కో ఆర్డినేటర్ గౌరీలు సమావేశమై చర్చించి, నిర్ణయించారు. నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగే ఈ పోటీలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుతాయని తెలిపారు.కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో, షటిల్, చెస్, యోగాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కో ఆర్డినేటర్ గౌరీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుస్మిత, సునీత, కలీముల్లా మగ్దూమి, జగన్, వెంకట మధులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణపై అవగాహన

సిద్ధవటం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



మండలం టక్కోలు పంచాయతీ పరిధిలోని ఖాజిపల్లి గ్రామంలో ఈరోజు చెత్త సేకరణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగలింగేశ్వర్ రెడ్డి, డ్వాక్రా గ్రూప్ లీడర్ మహేశ్వరీ కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు తడి చెత్త-పొడి చెత్త వేర్వేరుగా వర్గీకరించాల్సిన అవసరం, దాని ప్రయోజనాలు వివరించారు.ప్రజలకు చెత్త సేకరణ విధానం, శుభ్రతతో వచ్చే ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ గురించి తెలియజేశారు అదేవిధంగా, పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరుతూ, IVRS కాల్స్ ద్వారా కూడా సమాచారం అందించబడుతుందని గ్రామస్థులకు వివరించారు. గ్రామం శుభ్రంగా ఉంటే వ్యాధులు దూరమవుతాయని, పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

## బీసీ గర్ల్స్ హాస్టల్లో అకస్మాత్తుగా తనిఖీ



కాశీనాయన సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని నరసాపురం బీసీ హాస్టల్లో మండల హెల్త్ సూపర్వైజర్ చంద్రశేఖర్ విద్యార్థులకు ఎలా ఉండాలని విద్యార్థులకు సీజనల్ విష జ్వరాలు ఎక్కువగా ఉన్నందున వారిని అప్రమత్తంగా ఉండాలని హాస్టల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని నీళ్లు కాంచి చల్లర బెట్టుకుని తాగాలని అంతేకాకుండా ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉండాలని వారికి తెలియజేశారు అంతేకాకుండా అన్నం తినేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కొని తినాలని కూరగాయలు , ఆకుకూరలు ఎక్కువగా వాడాలని హాస్టల్ వార్డెన్ కు తెలియజేశారు విద్యార్థులకు సద్ది అన్నము సద్ది కూరాకులు పెట్టకూడదని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ లక్ష్మీదేవి, హెచ్ ఎస్ హుస్సేనమ్మ ,ఏఎన్ఎం బీబీ, ఆశా వర్కర్ మల్లీశ్వరి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాజంపేటలో 5 గంటలు కరెంట్ కట్

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

రాజంపేటలో శనివారం ఐదు గంటలపాటు కరెంటు కట్ చేస్తున్నట్లు రాజంపేట విద్యుత్ సురేంద్రనాథ్ తెలిపారు. రాజంపేట టౌన్, 33/11 కేవీ సరస్వతిపురం, తాళ్లపాక, సబ్ స్టేషన్స్ నందు 11 కె.వి ఫీడర్ కు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం, మరమ్మత్తులు చేయదలచాము. కావున ఈ సబ్ స్టేషన్స్ పరిసర గ్రామీన ప్రాంతాలలో అనగా రాజంపేట టౌన్, మండలంలో విద్యుత్ సరఫరా ఉదయం 08.00 నుంచి మధ్యాహ్నం 01.00 గంటల వరకు నిలిపి వేయబడును. కనుక వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించ వలసినదిగా కోరారు.

## అంగన్వాడి ప్రాజెక్ట్ నూతన కమిటీ ఎన్నిక

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)



రాజంపేట అంగన్వాడి ప్రాజెక్టు నూతన కమిటీని రెండవ మహాసభలో ఎన్నుకోవడం జరిగినది. ప్రాజెక్ట్ అధ్యక్షురాలుగా ఎం విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎం ఈశ్వరమ్మ. కోశాధికారిగా పీవీ శివరంజని. ఉపాధ్యక్షులు. ఎస్ అమరావతి జి ఇందిరమ్మ పి విజయలక్ష్మి డి మమతా సి వనిత, సహాయ కార్యదర్శులుగా ఎం శివ జ్యోత్స్న ఎన్ అనురాధ, యూ ఉమామహేశ్వరి, జీ తులసి, డి స్వర్ణ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ కమిటీని సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షుడు అంగన్వాడి యూనియన్ గౌరవాధ్యక్షులు చిట్వేల్ రవికుమార్ తెలిపారు.

## ఎస్పికి అశోక స్తంభం జ్ఞాపిక బహుకరణ

తంబళ్లపల్లె సెప్టెంబర్ 12 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డికి మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, టిడిపి నాయకులు అశోక స్తంభం, స్మారక చిహ్నం గౌరవార్థం బహుకరించారు. ఈ సందర్భంగా రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి శాంతి భద్రతల నిర్వహణ తోబాటు వినాయక చవితి నిర్వహణ, సమస్యల పరిష్కారంలో నిస్వార్థంగా, నిజాయితీగా సేవ చేసినందుకు గాను ఈ జ్ఞాపికలను అందజేసినట్లు తెలిపారు. ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి వారికి ధన్యవాదాలు తెలుపుతూ ఈ జ్ఞాపికలు దేశభక్తిని చాటి చెప్పే ప్రయత్నం చేయడం హర్షనీయమన్నారు. వారి వెంట టిడిపి నాయకులు నరసింహులు, మదనమోహన్, భాష, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదర్శప్రాయుడు కావాలి




ఎడ్యుకేషన్ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

భారతదేశంలో ఉన్న యువత ఎక్కువమంది విప్లవకారుడు చేగువేరా విధానాలను అనుసరిస్తున్నారని కానీ దేశం కోసం ప్రాణాలను తృణపాయంగా వదిలేసిన సుభాష్ చంద్రబోస్ ఒక ఆదర్శవంతుడు యువతకు కావాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జి దేవరాజ్ పిలుపునిచ్చారు.అఖిల భారత విద్యార్థి బ్లాక్ 9వ జాతీయ మహాసభలు కడప నగర వేదికగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. మహావీర్ సర్కిల్ నుండి ఎర్రముక్కపల్లి సంధ్యా సర్కిల్ మీదుగా జిల్లా పరిషత్ వరకు ర్యాలీగా వచ్చి, జిల్లా పరిషత్ దగ్గర బహిరంగ సభ ఏర్పాటు చేశారు.దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను విద్యార్థులకు అంగడి సరుకుల మార్చిందని, దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ విధానంలో కొనసాగుతుందని దీనివల్ల దేశ అభివృద్ధి కుంటుపడుతుందని వారు విమర్శించారు. విద్య వైద్యం రంగాలను పక్కనపెట్టి కార్పొరేట్ శక్తులైన అనిల్ అంబానీ ఆదాని ఒంటి శక్తులకు నరేంద్ర మోడీ దాసోహమై దేశాన్ని నాశనం చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులు పాటు జరిగే విద్యార్థి బ్లాక్ జాతీయ మహాసభలలో విద్యారంగ సమస్యల పైన, భవిష్యత్ కార్యాచరణ రూపొందించి, నూతన జాతీయ కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని వారు తెలిపారు.కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ నాయకులు అఖిల భారత విద్యార్థి బ్లాక్ జాతీయ అధ్యక్షుడు డాలర్, జయవర్ధన్, తేజ్ దీప రెడ్డి ,రాజు గొల్లపల్లి ,రాజ శేఖర్ గౌడ్ పాపిరెడ్డిపల్లి పృధ్వి సగిలి రాజేంద్రప్రసాద్ పోతులయ్య మరియు ఇతర రాష్ట్రాల ప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారు..

## పారిశుద్ధం పై ప్రత్యేక శ్రద్ధ చూపండి

తంబళ్లపల్లె సెప్టెంబర్ 12 ప్రభాతవార్త ః



సచివాలయాల పరిధిలోని పంచాయతీ గ్రామాలలో పారిశుధ్యం పై నిత్యం నిఘా పెంచి ప్రత్యేక శ్రద్ధ చూపాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు కార్యదర్శిని ఆదేశించారు. శుక్రవారం ఆయన రేణుమాకులపల్లి పంచాయతీలో పర్యటించి గ్రీన్ అంబాసిడర్లు చేపట్టిన పారిశుధ్యం పనులలో భాగంగా చెత్త సేకరణ పై ఆరా తీశారు. తడి, పొడి చెత్త వేరు చేసి డంపింగ్ యార్డ్ తరలించి ఎరువు తయారి చేపట్టాలన్నారు. తాగునీటి క్లోరినేషన్, దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో 12 సచివాలయాలలో ఇదేవిధంగా పారిశుధ్య పనులు చేపట్టాలని ఇంచార్జ్ ఈఓ ఆర్ డి ఈశ్వర్ రెడ్డికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి, గ్రీన్ అంబాసిడర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## జీవన ఎరువులతో సేద్యం ఆదర్శం కావాలి

తంబళ్లపల్లె సెప్టెంబర్ 12 ప్రభాతవార్త ః



నేటి కలుషిత వాతావరణం పారద్రోలడానికి రైతులు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవన ఎరువులు, జీవామృతం, ఖనిజామృతం, పశువుల పేడ, మూత్రంతో పంటలు పండించి పర్యావరణ పరిరక్షణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందాలని స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో థామస్ రాజా, ఏవో రమణ కుమార్ ల తో కలిసి కోటకొండ, కుక్కరాజుపల్లి, రెడ్డికోట పంచాయతీలలో రైతులతో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా వాడకంపై అవగాహన కల్పించి నానో యూరియా వాడకంతో సత్ఫలితాలు వస్తాయిని సూచించారు. ప్రతి రైతుకు యూరియా పంపిణీ జరుగుతుందని ఆందోళన చెందొద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో పంచాయితీ కార్యదర్శులు, ఎఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## పెండింగ్ నిధులు విడుదల చేయాలి

మదనపల్లె క్రైమ్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త.



రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులను విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఏబీవీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనీ ఉన్నత విద్య పేద విద్యార్థులకు గుదిబండల మారిందని అన్నారు. నారా లోకేష్ యువగళంలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెంబర్ 77ను రద్దుచేసి ప్రైవేటు కళాశాలలో పీజీ చదివేటువంటి విద్యార్థులకు కూడా ఫీజు రియంబర్స్మెంట్ కల్పించాలని కోరారు అంతేకాకుండా కొత్తగా మొదలైనటువంటి మెడికల్ కళాశాలలో ప్రభుత్వం తెచ్చినటువంటి పీపీపీ విధానాన్ని రద్దుచేసి పూర్తి స్థాయిలో గవర్నమెంట్ ద్వారానే కళాశాల నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను సందేశించానని ఎక్కడ కూడా సరైన వసతులు లేవని మండిపడ్డారు. రాష్ట్రంలో మెడికల్ విద్య సామాన్య విద్యార్థులకు అందని ద్రాక్షగా మారిందని అన్నారు. ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో ఏబీవీపీ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కన్వీనర్ సాయి హితేష్, అశ్విత్, వెంకట రమణ సాయి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలను ఎంటిపి చట్టంపై అవగాహన

మదనపల్లె, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :

శిశుసంక్షేమశాఖలోని సిడిపిఓలకు, సూపర్వైజర్లకు, మహిళా పోలీసులకు, అంగన్వాడీ కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు, ఆశాలకు డివిజన్స్థాయి శుక్రవారం వర్క్షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ విద్యాధికారి మహమ్మద్రఫి ఎంటిపి చట్టంపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, పునరుత్పత్తి, ఆరోగ్యం, పోషణ, రుతుక్రమ పరిశుభ్రతపై వివరించారు. సిడిపిఓ, డిస్టిక్ మిషన్ శక్తి కోఆర్డినేటర్ నాగవేణి పలు విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుజాత, భారతి, భాగ్యమ్మ, డివిజన్ పరిధిలోని సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న సుధా పరిమళకి వీడ్కోలు



మైదుకూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:

మండలంలోని లెక్కలవారిపల్లె ప్రాథమిక పాఠశాల నుండి బదిలీ పై దయాన్ ఖాన్ పల్లె ప్రాథమిక పాఠశాల కు వెళ్లిన ఉత్తమ ఉపాధ్యాయురాలు సుధా పరిమళకి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు పద్మలత, నరహరిశర్మచే సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ సుధా పరిమళ నిబద్ధతతో అకుంఠిత దీక్షతో విధులు నిర్వహించి పాఠశాల లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఎంతగానో దోహద పడిందని తెలిపారు.విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పి గ్రామ ప్రజలలో మంచి పేరు సంపాదించారని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు పాలకొండయ్య, మల్లేశ్వరరెడ్డి, రాజు, చంద్రశేఖర్, కిరణ్ కుమార్, నారాయణ ప్రసాద్ మహిళా ఉపాధ్యాయులు భారతి, నీలావతి, శ్రీదేవి, పద్మజ, అపర్ణ, ఇందిరా రిటైర్డ్ టీచర్ వీరలక్షుమ్మ ఇంకా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు జయప్రదం చేసినారు.

## టెండర్ను దక్కించుకున్న ఎన్వి శివకుమార్

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని దసరా పండుగ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ వేలంపాటలో బాక్స్ సి టెండర్ ద్వారా అత్యధిక వేలంపాట ఒక కోటి 91 లక్షల 44 వేల రూపాయలకు వేసిన గుత్తేదారుకు ఎగ్జిబిషన్ ఖరారు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం ప్రొద్దుటూరు ఎగ్జిబిషన్ వేలం పాట మొదలైన కొద్దిసేపటికి మున్సిపల్ అధికారుల అవగాహన రాహిత్యం వల్ల వాయిదా పడటం, మధ్యాహ్నం తిరిగి ప్రారంభమై పూర్తయింది. ఈ సందర్భంగా 1 కోటి 94 లక్షల 44 వేల రూపాయలు ఎగ్జిబిషన్ టెండర్ పలికింది. బాక్స్ వేలం ద్వారా టెండర్ ను ఎన్.వి. శివకుమార్ దక్కించుకున్నారు. ఎగ్జిబిషన్ నిర్వహణ క్రమంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు.

## బీసీల వాగ్దానాలు అమలు చేయాలి

కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:



గత ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కడప జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లింగ మూర్తి, జిల్లా వర్కింగ్ ప్ర గోవింద్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్ యాదవ్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కడప కలెక్టరేట్ కు ర్యాలీగా వెళ్లి.. కలెక్టర్ను కలిసి బీసీల ఐదు ప్రధాన డిమాండ్లపై మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడిన బీసీలకు.. ఎస్సీ, ఎస్టీల వలలే ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల వాగ్దానం చేశారన్నారు. ఏడాదిన్నర గడుస్తున్నా ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, నామినేషన్ వర్క్స్ లలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వాగ్దానం చేశారు. కుల గణనను నిర్వహించకుండా, ప్రాదేశిక నియోజక వర్గాల విభజన పూర్తి చేయకుండా, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీసీలకు జనాభా దామాషా మేరకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సలహాదారులు సుంకేసుల ఖాదర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, నగర అధ్యక్షులు నరసింహం, నగర కార్యదర్శి గొడుగు హరికుమార్, రానా ప్రతాప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బీసీ నాయకులు సూరీడు, గంగయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

గోపవరం. సెప్టెంబర్.12 ప్రభాతవార్త




మండలం ప్రాథమిక పాఠశాల వల్లెర వారి పల్లె లో విద్యార్థులకు ఆర్ ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజన ప్లేట్లు, వాటర్ బాటిల్స్, గ్లాసులను పంపిణీ చేయడం జరిగిందని ఫౌండేషన్ గౌరవ సలహాదారులు మానుగుంట రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి రఘురామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్లేట్లు,.గ్లాసులు, వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేసిన ఆర్ఎస్ ఫౌండేషన్ వారిని అభినందించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వం అందించే సదుపాయాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆర్ ఎస్ ఫౌండేషన్ గౌరవ సలహాదారులు మరియు డెమొక్రటిక్ పిఆర్టియు జిల్లా అధ్యక్షులు రవిశంకర్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన కనీస అవసరాలు, అనాధల కోసం అండగా ఉంటుందని,. భవిష్యత్తులో ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎర్రం రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, సిద్దు, పాఠశాల ఉపాధ్యాయులు రామచంద్రయ్య,తేజస్విని మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డులు

వాల్మీకిపురం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మండలంలో అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్టు రేషన్ కార్డు పంపిణీ చేయనున్నట్లు స్థానిక తహసీల్దార్ పామిలేటి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో స్మార్టు రేషన్ కార్డుల పంపిణీ విధానంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రేషన్ డీలర్లు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. సమావేశానికి ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడుతూ స్మార్టు కార్డుల పంపిణీకి సంబంధించిన నిబంధనలు, సాంకేతిక విధానాలు, ప్రజల సౌకర్యార్థం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు ఎవరికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు తదుపరి దశలో సెప్టెంబరు 14వ తేదీ ఆదివారం ఉదయం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే ఈ పాస్ మిషన్లను అధికారికంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ పజుల్లా, సీనియర్ అసిస్టెంటు మహేష్ సచివాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## 17న మండల సమావేశం

చాపాడు. సెప్టెంబర్ 12. ప్రభాతవార్త :

స్థానిక మండల పరిషత్ సభా భవనం నందు ఈనెల 17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీర కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆయా శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు వారి సమగ్ర నివేదికతో హాజరు కావాలన్నారు.

## విద్యార్థి అన్నిటిలోనూ మిన్నంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



విద్యార్థి విద్యతో పాటు అన్నిటిలోనూ మిన్నంగా ఉండాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్ పేర్కొన్నారు ఈ నెల 11వ తేదీన రాయచోటిలో జిల్లాస్థాయిలో కళా ఉత్సవం కార్యక్రమంచారు ఈ కార్యక్రమంలో చందన , అర్చనలు చిత్రలేఖ చిత్రలేఖనలో జిల్లాస్థాయి ప్రతిభ కనబరిచారు వీరికి బెమోంటు ప్రశంస పత్రాన్ని అందజేశారు శుక్రవారం ఏపీ మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ రమేష్ నెమంటూ ప్రశంస పత్రాన్ని అందజేసి వారిని అభినందించారు ఇలాంటి ప్రతిభవులు ఎన్నో కనపరిచి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కళా వస్తావా గైడ్ షర్ఫుద్దీన్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్కు ఘనంగా సన్మానం



లక్కిరెడ్డిపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్గా ఎస్ ఎం డి షఫీనాయక్ 11వ తేదీన రాయచోటి మార్కెట్ యార్డ్ లో ప్రమాణ స్వీకారం నిర్వహించారు శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులో చైర్మన్గా బాధ్యతలు చేపట్టారు సందర్భంగా ఈ సందర్భంగా షఫి నాయక్ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని అందుకు తోటి డైరెక్టర్లు కూడా సహాయ సహకారాలు అందించాలన్నారు అనంతరం రైతు చైతన్య ప్రచార సేవ వేదిక రాష్ట్ర కన్వీనర్ చెంచర్ల ఆంజనేయులు పాలకవర్గ సభ్యులు బిజెపి సీనియర్ నాయకులు కొర్లకుంట కృష్ణయ్య ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ చంద్రయ్య జిల్లా కన్వీనర్ అబ్బాస్ అలీ ఖాన్ జేబీఎస్ఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు లక్కీ శశిధర్ జిల్లా నాయకులు నల్లగాల గంగాధర బిజెపి నాయకులు జై చంద్రబాబు, తిరుపతి వెంకటరమణ రవీంద్ర యాదవ్ శంకరప్ప మార్కెట్ యార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారుల ప్రోత్సాహకం రూ.1 లక్ష వితరణ



కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషిచేస్తానని ఆర్.వి. టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి. రమణ పేర్కొన్నారు. శుక్రవారం గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో రాణించిన విద్యార్థినుల అభినందన సభలో ముఖ్యఅతిథి ఆర్.వి. రమణ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మరిన్ని వసతులు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరన్నారు. ఉపాధ్యాయుడు, అంతర్జాతీయ వెటరన్ అథ్లెటిక్స్ క్రీడాకారుడు బొగ్గేటి శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. క్రీడల అభివృద్ధి కోసం ఆర్.వి. టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి. రమణ రూ.1 లక్షను విరాళంగా ఇవ్వటం గొప్పవిషం అన్నారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. దాతల సహకారం ఉంటే రానున్న రోజుల్లో జాతీయస్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతామని ప్రకటించారు. 2025,26 లో పదోతరగతిలో ప్రథమస్థానం సాధించే విద్యార్థికి వివేకానంద క్లాత్ మార్కెట్ మాజీ అధ్యక్షుడు చిన్నపరెడ్డి రూ. 10వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్, ఉపాధ్యాయులు రవివవంకర్, గౌస్, దశరధరామిరెడ్డి, తేజోవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల ప్రత్యేక అధికారిని ఘనంగా సన్మానించిన

ముద్దనూరు. సెప్టెంబర్ 12. ప్రభాతవార్త :



మండల ప్రత్యేక అధికారినిగా విధులు నిర్వహిస్తున్న పరిపూర్ణ అరుంధతి పదోన్నతి పై రాయచోటి మండలం ఎంపీడీవోగా బదిలీపై వెళుతున్న సందర్భంగా మండల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు.

## అమ్మవారికి ప్రత్యేకపూజలు

రామసముద్రం సెప్టెంబర్ 12ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామం లో వెలిసిన మారెమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మ వారికి పలురకాల పుష్పాలు, వేపాకు, నిమ్మకాయలు హారంతో అలంకరణ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి శీనప్ప భక్తులకు అమ్మ వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇంటి వద్దకే వైద్య సేవలు

రామసముద్రం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో ఇంట వద్దకే వైద్య సేవలు డాక్టర్ జాహ్నవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ప్రభుత్వం పేదల వైద్యంపై దృష్టిపెట్టారన్నారు. పలు వైద్యా పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఇంజక్షన్. మందులు ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగానే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. జ్వరం, దగ్గు, కీళ్ళ నొప్పులు, నరాల బలహీనతవంటి లక్షణాలు కలిగినవారికి వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాహ్నవి, సి హెచ్ ఓ ఉమాదేవి ఉమాదేవి, ఏ ఎన్ఎం గీతారాణి, ఆశావర్కర్స్ లక్ష్మిదేవి, బానుప్రియ, గౌతమి, ఏసీ వెంకటముని సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పీలేరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

పీలేరు సబ్స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్కో ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రెండవ శనివారం సందర్భంగా పీలేరు సబ్స్టేషన్లో మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని, ఫలితంగా శనివారం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పీలేరు పట్టణంలోని తిరుపతి రోడ్డు, చిత్తూరు రోడ్డు, కడప రోడ్డు, చెన్నారెడ్డి కాలనీ, ఆర్టీసీ నల్లగుట్ట, బివి రెడ్డి కాలనీ, మల్లెల గ్రౌండ్, పద్మావతినగర్కు విద్యుత్ సరఫరా ఉండదని, కావున విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని పత్రిక ముఖంగా ఆయన కోరారు.

# నిరంతర భగవాన్ నామస్మరణమే మనిషిని సర్వవిధాలా కాపాడును






**గోపవరం. సెప్టెంబర్.12 ప్రభాతవార్త**

రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రాచపూడి నాగభూషణం ఫంక్షన్ హాల్ నందు భగవద్గీత సప్తాహ కార్యక్రమంలో ఆరవ రోజు స్వామి తురీయానంద సరస్వతి వారి ఆధ్వర్యంలో ప్రవచనము సాగినది. మనిషి నిరంతరం భగవనామస్మ రణ మరియు భగవత్ చింతనలో ఉండాలి. మానవుడు తన అంత్యకాలములో భగవాన్ నామస్మరణ చేస్తే అతను భగవంతుడు లో లీనమైపోతాడు. అయితే మనిషికి అంత్యకాలము ఎప్పుడో ప్రశ్నించుకోవాలి. తన అంతకాలం ఎవ్వరికీ తెలియదు .అది ఎప్పుడైనా నిన్ను తీసుకుని పోతుంది. కావున నిరంతరం భగవంతుని చింతనలో ఉండాలని స్వామీజీ వారు తమ ప్రవచనంలో బోధించారు. మనం ఏ పని చేస్తున్నా భగవంతుని దృష్టిలో పెట్టుకుని చేయాలి. మనిషి వృద్ధాప్య అంత్యకాలములో భగవాన్ నామస్మరణ చేయాలని చెప్పారు. కానీ నిరంతర సాధన లేదు కావున అంత్య కాలంలో అతడు భగవన్నామ స్మరణ చేయలేడు. చిన్నతనం నుండి భగవన్నామస్మరణ అలవాటు కావాలి. ప్రహ్లాదునికి, మార్కండేయనికి అబ్బినట్లుగా మనకు మరియు మన పిల్లలకు మనం అలవాటు చేయాలి. ఎవరైతే భగవంతుని స్మరిస్తూ నిష్కామ కర్మ చేస్తే వారి యోగ క్షేమాలను భగవంతుడే చూసుకుంటాడని భగవద్గీత తెలియజేస్తుంది. ఎంతో బలవంతుడైన గజేంద్రుడు తన శక్తి యుక్తులు నశించాక చివరికి నా వల్ల ఏదీ జరగలేదు అంతా భగవంతుని చిత్తముతో నడిచినది. కావున నన్ను రక్షించేవాడు ఆ దేవదేవుడని ఆ భగవంతుని ప్రార్థించింది. అప్పుడు భగవంతుని చేత అది కాపాడబడింది. అలా నిరంతరం నీ శక్తిని తెలుసుకొని భగవంతుని పట్ల సర్వస్య శరణాగతి పొందాలి. సంపాదించిన ధనము, భార్య, బిడ్డలు ,బంధువులు మనిషి యొక్క అంతకాలంలో కాపాడలేవు. కాపాడేది భగవన్నామము మాత్రమే. నిరంతరం భగవంతుని నామస్మరణే మనిషిని ఒక అత్యున్నతమైన స్థాయికి తీసుకెళుతుందని స్వామీజీ వారు భగవద్గీతలోని రహస్యాలను బోధించారు. ఇంకా మరిన్ని గొప్ప విషయాలు దైనందిక జీవితంలో ఎలా నడుచుకోవాలో భగవద్గీత చెప్పిన విషయాలను రేపటి తరగతులలో తెలుసుకుంటారని సెలవిచ్చారు. హాజరైన భక్తులందరికీ కార్యనిర్వాహకుల చేత ప్రసాద వితరణ చేయడం జరిగినది. రేపటి చివరి రోజు అయిన సప్తాహ ప్రవచన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని నిర్వాహకులైన రామకృష్ణ సేవా సమితి సభ్యులు కోరినారు.

## పిహెచ్‌డి స్కాలర్‌కు ప్రథమ బహుమతి



**రాజంపేట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో పీహెచ్డీ స్కాలర్గా పరిశోధన చేస్తున్న షేక్ పర్వీన్ బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధికి ఉపయోగించు ఔషధమూలికలపై పత్ర ప్రదర్శన చేసినందుకు మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల ప్రథమ బహుమతి సాధించారు. నిర్మల ఫార్మసీ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి సెమినార్లు ఈ బహుమతి లభించినట్లు కళాశాల కార్యదర్శి డాక్టర్ సి గంగిరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటుచేసిన అభినందన సభలు ప్రతిభ చాటిన విద్యార్థినికి గంగిరెడ్డి ప్రశంసా పత్రం అందజేశారు. పర్వీన్ ను అభినందించారు.

## దివ్యాంగులకు ఉచిత వైద్య సేవలు



**బద్వేల్ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

బద్వేల్ మైదుకూరు రోడ్డు పోలేరమ్మ గుడి ఎదురుగా ఉన్న డాక్టర్ దాసరి శ్రీను హాస్పిటల్ నందు దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం ద్వారా ఎముకల సాంద్రత మరియు షుగర్ బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు డాక్టర్ డి. ధరణి ఇంద్ర నీలమణి(ఎంబిబిఎస్, జనరల్ ఫిజీషియన్,) మరియు డాక్టర్ డి. భరణి శ్రీ హంసిణి (బిపిటి ఎంఐ ఏపి) డాక్టర్లు పరీక్షించి వైద్య సేవలు అందించినారు. ఈ యొక్క వైద్య సేవలలో దివ్యాంగులు, వృద్దులు, పేద ప్రజలు అందరూ పాల్గొన్నారు.

## శ్రీవాణికి ఉత్తమ అకాడమెడిషియన్ అవార్డు



**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

అన్నమాచార్య యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఐ. శ్రీవాణికికి ఉత్తమ అకడెమిషియన్ అవార్డు – 2025" దక్కింది. అన్నమాచార్య యూనివర్సిటీ హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగంలోని రసాయన శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఐ. శ్రీవాణి విశిష్టమైన పరిశోధనా కృషి, ప్రతిష్టాత్మక పత్రికల్లో చేసిన ప్రచురణలకుగాను సైంటిఫిక్ ఇంటర్నేషనల్ పబ్లిషింగ్ హౌస్ వారు ప్రదానం చేసిన ఉత్తమ అకడెమిషియన్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సి. గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ సి. యెల్లారెడ్డి, డా. శ్రీవాణికి అభినందనలు తెలియజేస్తూ,"విశ్వవిద్యాలయానికి ఇలాంటి నిబద్ధత కలిగిన అధ్యాపకులు ఎంతో అవసరం. వారు విద్యార్థులకు మాత్రమే కాకుండా సహచర అధ్యాపకులకు కూడా ప్రేరణగా నిలుస్తారు" అని పేర్కొన్నారు.

## మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు

**వాల్మీకిపురం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :**

మండలంలోని కొత్త మంచూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గత రెండు రోజులుగా మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు జరిగాయి. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ క్రీడాపోటీలకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించి, అండర్14 నుంచి అండర్17 స్థాయి వరకు బాల బాలికలకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు అండర్17, అండర్14 వాలీబాల్ విభాగాల్లో వాల్మీకిపురం పీవీసీ జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్14 ఖోఖో విభాగంలో కొత్తమంచూరు బాలికల జట్టు విజేతగా నిలిచింది. అలాగే అండర్17, 14 కబ్బడీ పోటీల్లోనూ కొత్తమంచూరు జట్టు విజేతలుగా నిలిచాయి అండర్17,14 షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో చింతపర్తి విద్యార్థులు విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. ప్రకాష్, ఉపాధ్యాయులు రెడ్డివరప్రసాద్, పాఠశాలకమిటీ చైర్మన్ హరినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలుగా ఎంపికైన క్రీడాకారులు

## 62 చెరువులకు హంద్రీ-నీవా జలాలు

**ఇరిగేషన్‌శాఖ ఈఈ సురేష్‌బాబు**

**మదనపల్లె, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :**



మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాలోని 62 చెరువులకు హంద్రీ–నీవా కాలువ ద్వారా క్రిష్ణా జలాలు నింపనున్నట్లు ఇరిగేషన్‌శాఖ ఈఈ సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో 53చెరువులు, మదనపల్లె నియోజకవర్గంలో 9చెరువులకు హంద్రీ–నీవా కాలువ ద్వారా క్రిష్ణా జలాలు నింపడం జరుగుతుందన్నారు. తొలుత ప్రభుత్వ ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో హంద్రీ–నీవా కాలువ ద్వారా క్రిష్ణాజలాలను నింపడం జరుగుతుందన్నారు. కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల తరువాత మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని చెరువులన్నీ నింపడం జరుగుతుందన్నారు. క్రిష్ణాజలాలు చెరువులకు నింపడంతో ఈ రెండు నియోజకవర్గాల్లో రైతులకు తాగు, సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. చెరువులన్నీ సంవృద్ధిగా క్రిష్ణా జలాలతో నిండితే రైతులు వ్యవసాయసాగును సంవృద్దిగా చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈనెలాఖరులోపు సుమారుగా చెరువులకు నీరు నింపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు చెరువుల పరిరక్షణ కోసం కృషిచేయడం జరుగుతుందన్నారు. తంబళ్ళపల్లె నియోజకవర్గంలో ఎక్కువశాతం చెరువులకు క్రిష్ణాజలాలు నింపడం జరుగుతుందన్నారు.

## రైతు సేవా కేంద్రాల్లో ఉల్లిని కొనుగోలు చేయాలి



**వేంపల్లి: సెప్టెంబర్ 12 (ప్రభాత వార్త):**

క్వింటాలు రూ 3000 రైతు సేవా కేంద్రాలలో ఉల్లిని కొనుగోలు చేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వేంపల్లి మండలంలోని చింతల మడుగు పల్లెలో గంగిరెడ్డి వేసిన ఉల్లి పంటను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదు. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చని సేద్యం బాగుపడవు. వ్యవసాయము పండుగ కావాలి అన్నారు. కానీ దురదృష్టవశాత్తు కూటమిపాలనలో రైతులు ఏడుస్తున్నారు, వ్యవసాయము దండుగ అనే వాతావరణం ఏర్పడింది అని వారు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు నాణ్యమైన ఉల్లిని 1200 రూపాయలకు కొంటామంటూ జిల్లాలో ఒకటి రెండు చోట్ల కంటి తుడుపు చర్యగా కొనుగోలు కేంద్రాలు తెరుస్తూ ఉంది . దీనివలన రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదు. ఉల్లి రైతులను నిజంగా ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కూటమి ప్రభుత్వానికి ఉంటే క్వింటాలు 3000 రూపాయలు చొప్పున రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,చిన్నకోట్ల నాగరాజు, బండారు వెంకటేష్, వినయ్, బద్రి, రాఘువయ్య, ఉల్లి రైతులు గంగిరెడ్డి, అయ్యవారయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూరియా వినియోగంపై రైతులకు అవగాహన

**కె.వి పల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :**

యూరియా సమతుల్య వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పీలేరు ఏడిఏ వైవి రమణ రావు తెలిపారు. శుక్రవారం పీలేరు మండలం, అగ్రహారం పంచాయితీ, కమ్మమిట్టపల్లిలో వరి పంట సాగు చేసే రైతులకు జరిగిన అవగాహన కార్యక్రమానికి ఏడిఏ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట పండించే రైతులు ఎకరాకు రెండు బస్తాలు వంతున మూడు విడతలుగా వేయాలని, వరి నాటే సమయంలో ఒక సంచి, 30 రోజుల సమయంలో అర బ్యాగు, 60 రోజులు అంటే పొట్టు దశలో అర బ్యాగు యూరియా వాడుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఒక బ్యాగు యూరియా బదులు 500 మిల్లీలు నానో యూరియా ఎకరాకు రెండవ, మూడవ దశలో పిచికారి చేసుకోవాలని వివరించారు. దీనివలన 80 శాతం నత్రజని ఆకు ద్వారా యూరియా అధికంగా వాడటం వలన చీడపీడలు పెరుగుతాయని, నీటి కాలుష్యం, సాగు ఖర్చు పెరుగుతుందని తెలిపారు. భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు కూడా ఎక్కువగా వేసుకోవాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారిణి ఓ. రమాదేవి మాట్లాడుతూ మన గ్రోమోర్ లో, బోడుమల్లువారిపల్లి, తలుపుల ఎఫ్.పి.ఓలు, కాకులారంపల్లి, పీలేరు ఆర్.ఎస్.కె లలో 70 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన పడాల్సిన పనిలేదని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ పి. సుధారాణి మాట్లాడుతూ వరిలో అజోల్లా మొక్కను పెంచడం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించడం, పచ్చ రొట్టె ఎరువులు, దిబ్బ ఎరువు, నత్రజని మోతాదును పెంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నజీర్, అల్తాఫ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది నీరజ, జహ్నవి, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రమణ రావు

## ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



**లక్కిరెడ్డిపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం మని ప్రజా చైతన్య సేవా సంస్థ కోఆర్డినేటర్ వరలక్ష్మి దేవి సివి రమణారెడ్డిని పేర్కొన్నారు శుక్రవారం దేవళంపల్లి , లక్కిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చెడు వ్యసనాలకు బానిస కాకూడదని డ్రగ్స్ వాడటం చిన్న వయసులోనే ఈ దూరంగా ఉండాలన్నారు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను ఆదరించాలన్నారు సమాజంలో ఎయిడ్స్ క్షయ వ్యాధి అవగాహన కలిగించాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ ఉపాధ్యాయులు రమణారెడ్డి సీతారామ సుబ్బలక్ష్మి దేవి ఎస్ ఎస్ ఓ ఆర్ డబ్ల్యు అలేఖ్య పీఈ లక్ష్మీదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మవారిశాల నూతన అధ్యక్షుడిగా అయ్యపు సురేష్ బాబు

**బ్రహ్మం గారి మఠం సెప్టెంబర్ 12ప్రభాతవార్త:**



బ్రహ్మంగారిమఠం మండల కేంద్ర లోని వెలిసినటువంటి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆర్య వైశ్య అమ్మవారిశాల నూతన అధ్యక్షుడిగా అయ్యపు వెంకట సురేష్ బాబు ఆర్యవైశ్యులు అందరం ఏకగ్రీవంగా ఎన్నుకున్నాట్లు మాజీ అమ్మవారి శాల అధ్యక్షుడు బన్నూరి కృష్ణమూర్తి, యువజన సంఘం అధ్యక్షుడు యాదాళ్ళ వెంకటసుబ్బయ్య సుంకు సురేష్ బాబు, అమరావతి బ్రహ్మం, యాదాళ్ళ సురేంద్ర, బింగి సురేంద్ర,దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. నూతన అధ్యక్షుడు అయ్యపు సురేష్ బాబు మాట్లాడుతూ నాకు అప్పగించిన ఇంత పెద్ద బాధ్యతను అందరి సహకారం సూచనలతో, ముందుకు వెళతానని,ఆర్యవైశ్య మహిళలు సంఘం సభ్యులు,అవోపా సభ్యులు,పెద్దలను, యువజన సంఘం సభ్యులు, యువకులు,అందరూ సహకరిం చాలని,జరగబోయే కన్యకాపరమేశ్వరి అమ్మవారి శరవన్న నవరాత్రులు ఉత్సవాలను,వైభవంగా నిర్వహిస్తామన్నారు. నన్ను అధ్యక్షుడుగా ఎన్నుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ దన్యవాదము లని అన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ



**బద్వేలు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

ప్రస్తుత సీజన్లో అనేకమంది జ్వరాల బారిన పడుతున్న విషయం తెలిసిందే .ఈ నేపథ్యంలో అనేకమంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న యువనేత టిడిపి ఇంచార్జ్ రితేష్ రెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలించారు. అక్కడికి వైద్య సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే రోగులకు సరైన చికిత్స అందించాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో నెలకొన్న పలు సమస్యలపై ఆరా తీశారు. డాక్టర్ ల కొరత విషయమైపై స్థాయి సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## అన్నిటికన్నా విలువైనది అక్షరాస్యత..



**వేంపల్లి: సెప్టెంబర్ 12 (ప్రభాత వార్త):**

స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవ ముగింపు వేడుకలు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నాగేంద్ర తెలియచేశారు .ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న సంపదలన్నిటికంటే అక్షరాస్యత అనే సంపద చాలా విలువైనదని, దీని విలువను మన మందరము గుర్తించి మిగిలిన ప్రజల యొక్క అభ్యున్నతికి పాటుపడాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం. ఓబుల్ రెడ్డి అక్షరాస్యత వలన కలిగే ప్రయోజనాలు, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ అక్షరాస్యతలో సంపూర్ణత సాధించే దిశగా ప్రయత్నించాలని, విద్యార్థినీ విద్యార్థులకు సూచన చేశారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలలో పాల్గొని విజేతలు అయిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్. నాగలక్ష్మి దేవి, శ్రీమతి కిరణ్మయి, డాక్టర్ రామకృష్ణ, పీ.డి.తేజేంద్ర, వినోద్ కుమార్, ప్రసాద్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించి, విద్యార్థిని విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

**సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య.**

**పులివెందుల, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

పులివెందుల పట్టణం బాకరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇస్లాంపురంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రోజున "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమము నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ప్రజలకు మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల పెరుగుదల నివారణకు పాటించవలసిన చర్యల గురించి వివరించారు. అదేవిధంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, నీటి నిల్వలను ఖాళీ చేసి, దోమల పెరుగుదలను అరికట్టాలని రాత్రి పూట తప్పని సరిగా దోమతెరాలు వాడాలి అని సిద్దయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సోమలింగారెడ్డి, సావిత్రి ఆశా కార్యకర్త ఇంద్రావతి పాల్గొన్నారు.



శుభ్రత పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## ఆర్థిక నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి




**దువ్వూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:**

ప్రజలు ఆర్థిక నిరాల పట్ల అవగాహన కలిగి జాగ్రత్త వహించాలని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి విజయ విహారి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని భీమునిపాడు గ్రామంలో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో డిపాజిటర్లకు అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్దన్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ బ్యాంకులలో ఖాతాలను అప్డేట్ చేసుకోవాలని అందువల్ల సామాజిక వ్యక్తిగత భద్రత కలుగుతుందన్నారు. అదేగా వడ్డీలకు ఆశపడి మోసపోవద్దన్నారు. ఈ సందర్భంగా హెడ్ సంస్థ ముద్రించిన కరపత్రాలను, బ్రోచర్లను విడుదల చేశారు. కళాజాత బృందంచే మ్యాజిక్ షో నిర్వహించి సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణారెడ్డి, పెరుగు కృష్ణయ్య, ఉదయ్ కుమార్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారం

**కలికిరి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, పంచాయతీ కార్యదర్శి గంగాదేవిలు మంచినీటి సమస్యను పరిష్కరించడం జరిగింది. గ్రామంలోని రక్షిత మంచినీటి బోరులో పూర్తిగా నీరు అడుగంటాయి. దీంతో గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తడంతో స్థానిక సర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని, ఎంపీడీవో భానుమూర్తిరావును ఆదేశించారు. దీంతో వారి ఆదేశాల మేరకు సర్పంచ్ బోరు ఏర్పాటు చేయడంతో పుష్కలంగా నీరు పడ్డాయి. కొత్త బోరు నుంచి గ్రామంలో పైపులైను ఏర్పాటు చేయడంతో పాత హరిజనవాడలో శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారం అయ్యింది. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

## అక్షరాస్యత వారోత్సవాలు



**మైదుకూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరులో అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా ఎన్ఎస్ఎస్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అతిథులుగా జె.వి.వి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఏ.వి. రమణయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షులు కాజా హుస్సేన్, జె.వి.వి మ్యాజిక్ రాష్ట్ర కన్వీనర్ హరే రామ్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో అక్షరాస్యతతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అత్యంత అవసరమని సూచించారు. రమణయ్య విద్యార్థులు జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. హుస్సేన్ పాటల రూపంలో విద్య విలువను చాటి చెప్పారు. హరే రామ్ మ్యాజిక్ ప్రదర్శనతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలనపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పి.ఓ డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక జ్ఞానాన్ని పంచుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఎల్లప్పుడూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సామాజిక సేవలో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు అనురాధ లక్ష్మి, రాధా రామ్, రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, నరసింహారావు, నవనీశ్వర్ రెడ్డి, అయ్యవారు రెడ్డి, చంద్రాయుడు తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా జ్వరాల నియంత్రణ సాధ్యం

**సంబేపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవా ర్త**

ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నియంత్రణ సాధ్యమని డాక్టర్ శ్వేత భాను ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విషజ్వరాల బారిన పాడకుండా అవగాహన కల్పించారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి జయరామయ్య మాట్లాడుతూ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు మలేరియా, ఫైలేరియా,డెంగీ, చికెన్ గున్యా,మెదడువాపు జ్వరాల నియంత్రణ మరియు వ్యాప్తిని కొద్దిపాటి జాగ్రత్తలతో అరికట్టవచ్చన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఫ్రైడే డ్రై డే లో భాగంగా స్థానిక పిహెచ్ సి సిబ్బందితో కలసి ఇంటింటి లార్వా సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. దోమతెరలు వాడకం,రాత్రి సమయంలో పచ్చి వేపాకు పొగ పట్టడం చెయ్యడం ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. తీవ్ర జ్వరం,చలి,తలనొప్పి,నీరసం,వాంతులు,రక్త కణాలు తగ్గిపోవడం, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే రక్త పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు కె.కవిత, అహ్మద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**సిద్ధవటం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

సిద్ధవటం మండలంలో పెన్నా నదిలో వరద నీరు ప్రవహిస్తూ ఇసుక దొరకని పరిస్థితిలో కూడా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు రాబడిన సమాచారం మేరకు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ అదుపులోకి తీసుకున్నామని మండల ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపారు మండలంలోని మాచుపల్లి, కడప రహదారి నందు శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని మండల తాసిల్దార్‌కు అప్పచెప్పామని కొన్ని పల్లె ప్రాంతాల్లో ఇసుక డంపింగ్ ఉన్నట్లు సమాచారం ఉందని వాటిపై నిఘా పెట్టి అక్రమ ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు